## క్లుప్తంగా

### ఆదిత్యాలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం


ఈవో ప్రసాద్‌కు విరాళం అందజేస్తున్న దాతలు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ అభివృద్ధికి విశాఖపట్నం జిల్లావాసి, ఎస్‌.వి.గ్రాండ్ యజమాని నారాయణశెట్టి మురళీకృష్ణ, వసంతకుమారి దంపతులు రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈమేరకు ఆదివారం ఈవో కె.ఎస్‌.వి.డి.వి.ప్రసాద్‌కు విరాళ చెక్‌ను స్థానిక బలగ హెచ్‌పీ గ్యాస్ అధినేత డబ్బీరు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దాతలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు ఇప్పిలి రంజిత్ శర్మ, బిన్నాడ నగేష్‌శర్మ తదితరులున్నారు.

### సత్యసాయి మందిరంలో వైద్య శిబిరం


వైద్యసేవలు అందిస్తున్న సిబ్బంది

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని న్యూకాలనీ సత్యసాయి మందిరంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మెడికవర్ ఆస్పత్రి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో వైద్యులు బీపీ, షుగర్, ఈసీజీ, థైరాయిడ్ వంటి పరీక్షలు ఉచితంగా చేపట్టారు.

### నేత్ర వైద్య శిబిరానికి స్పందన


కళ్లను పరిశీలిస్తున్న వైద్యులు

జి.సిగడాం: స్వచ్ఛంద సంస్థలు, దాతల ద్వారా నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పెంట గ్రామ సర్పంచ్ పున్నాన సోనియా కోరారు. ఆదివారం స్థానిక సచివాలయం ఆవరణలో విజయనగరం శ్రీవేంకటేశ్వర పుష్పగిరి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 55 మంది హాజరుకాగా 18 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పున్నాన అక్కలనాయుడు, కంటి వైద్యులు పూజిత, పీఆర్‌ఓ లక్ష్మణరావు పాల్గొన్నారు.

### రక్తదానం అభినందనీయం


రక్తదానం చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో ఆదిత్యా జుంబా డ్యాన్సు క్లబ్ సహకారంతో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 137 యూనిట్లు సేకరించారు. రక్తదాతలు, నిర్వాహకులను రెడ్‌క్రాస్ ప్రతినిధులు అభినందించారు.

### పోలీసుల విస్తృత తనిఖీలు


స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలతో ఒకటో పట్టణ పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్: అసాంఘిక కార్యకలాపాలను అరికట్టే చర్యల్లో భాగంగా ఎస్‌ఐ ఎం.హరికృష్ణ ఆధ్వర్యంలో ఒకటోపట్టణ పోలీసులు ఆదివారం నగరంలోని రాజీవ్ గృహ కాలనీలో కార్డన్ అండ్‌సెర్చ్ నిర్వహించారు. నివాసగృహాలు, పాన్ దుకాణాల్లో గంజాయి, మద్యం, నాటుసారా, నిషేధిత అక్రమ నిల్వలపై సోదాలు చేశారు. అనుమానితులను, పాత నేరస్థులను పిలిపించి వివరాలు సేకరించారు. సరైన పత్రాలు లేని ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళులు


జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

శ్రీకాకుళం అర్బన్: అణగారిన వర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్ అని డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు అన్నారు. బాబూ జగజ్జీవన్ రామ్ వర్ధంతి పురస్కరించుకొని ఆదివారం కాంగ్రెస్ నాయకులు అరసవల్లి కూడలి వద్ద జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# తాగునీటి పథకాలకు.. పొంచి ఉన్న ముప్పు

- నైరా పరిసర ప్రాంతంలో ఇష్టారాజ్యంగా తవ్వకాలు
- పట్టించుకోని అధికారులు


నాగావళి నదిలో భారీ యంత్రాలతో ఇసుక తవ్వకాలు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని నైరా పరిసర ప్రాంతంలో ఇసుక తవ్వకాలు ఇష్టారాజ్యంగా సాగుతున్నాయి. చెంతనే రక్షిత మంచినీటి పథకాలు ఉన్నప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలతో తవ్వకాలు చేపట్టడంతో తాగునీటికి ముప్పు ఏర్పడుతోంది. గ్రామాన్ని అనుసరించి నాగావళినది తీరం వెంబడి సీపీడబ్ల్యూ స్కీం ద్వారా 42 గ్రామాలకు తాగునీరు అందుతోంది. ప్రస్తుతం మితిమీరి ఇసుక తవ్వకాలు చేపడుతుండటంతో భవిష్యత్‌లో భూగర్భజలాలు అడుగంటిపోయే ప్రమాదముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ యంత్రాల తవ్వకాలు చేపడుతూ పెద్ద పెద్ద వాహనాలతో ఇసుక తరలింపు చేపడుతున్నా జిల్లా యంత్రాంగం స్పందించకపోవడంపై తీరప్రాంత ప్రజలు మండిపడుతున్నారు. మరోవైపు, గెయిల్ కంపెనీకి సంబంధించి గ్యాస్ పైపులైన్లు సైతం పంట పొలాల మధ్యలో విస్తరించి ఉన్నాయి. వీటిని ఆనుకుని తవ్వకాలు, రవాణా జరుగుతుండటంతో ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇసుక తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


నాగావళి నదిలోని సీపీడబ్ల్యూ స్కీం



పొలంలో గెయిల్ కంపెనీ హెచ్చరిక బోర్డు

# రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: రోటరీక్లబ్ శ్రీకాకుళం సేవలను మరింత విస్తృతం చేయాలని రోటరీ డిస్ట్రిక్ట్ పూర్వ గవర్నర్ జి.విశ్వనాథ్ పిలుపునిచ్చారు. అరసవల్లి కూడలిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో రోటరీ క్లబ్ శ్రీకాకుళం నూతన కార్యవర్గం ఎన్నిక ముని శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. నూతన అధ్యక్షుడిగా బరాటం శ్రీనివాస, కార్యదర్శిగా కిల్లాన శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా డా.బమ్మిడి సందీప్, కోశాధికారిగా కందుల నవీన్‌కుమార్, మెడికల్ డైరెక్టర్‌గా డా.ఎస్ విజయకుమార్, క్లబ్ లెర్నింగ్ ఫెసిలిటేటర్‌గా అన్నెపు సత్యనారాయణ, యంగ్ లీడర్‌గా డా.వారణాసి సందీప్, సర్వీస్ ప్రాజెక్ట్స్‌గా అన్నెపు అనంతరావు, ఫౌండేషన్ చైర్‌గా డి.శివశంకర్, ఎగ్జిక్యూటివ్ సెక్రటరీగా పసగడ సూర్యనారాయణ, మెంబర్‌షిప్ చైర్‌గా ఎంఆర్‌కే దాస్, పబ్లిక్ ఇమేజ్‌గా మంత్రి వెంకటస్వామి, సర్వీస్ ప్రాజెక్ట్‌గా దూసి సంతోష్, ఫెలోషిప్ చైర్‌గా ఇప్పిలి వెంకన్నచెట్టి, సార్జంట్ ఎట్ ఆరమ్స్‌గా వడగ సంతోష్‌లు ఎంపిక య్యారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్, జేసిస్, లయన్స్ క్లబ్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# వైష్ణవాలయాలకు ఏకాదశి శోభ


టీటీడీ కల్యాణ మండపంలో సత్యనారాయణ వ్రతాలు


కృష్ణార్జున మందిరంలో సత్యవ్రతాలు


నారాయణ తిరుమలలో వెంకన్న స్వామికి పూజలు


బ్యాంకర్స్ కాలనీ శివబాలాజీ ఆలయంలో..


పాతశ్రీకాకుళంలోని కల్యాణ వెంకన్న అలంకరణ


స్వామిని దర్శించుకున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పలు వైష్ణవ దేవాలయాలలో శయన ఏకాదశిని పురస్కరించుకొని ఆదివారం సత్యనారాయణ వ్రతాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుజరాతిపేటలోని నారాయణ తిరుమల వేంకటేశ్వరుని ఆలయంలో స్వామిని తులసిమాలలో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. చిన్నబజారులోని దూదివారి వేంకటేశ్వరస్వామి దేవాలయం, మొండేటివీధిలోని వేంకటేశ్వరాలయం, బ్యాంకర్స్ కాలనీలోని శివ బాలాజీ ఆలయం, కలెక్టర్ బంగ్లా వద్ద కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయం, డీసీసీబీ కాలనీలో భూ సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు, కల్యాణ వేడుకలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. టీటీడీ కల్యాణ మండపంలో గురుస్వామి రంగాభట్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 111 మంది దంపతులతో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆచరించారు. బొంతావారివీధిలోని కృష్ణార్జున మందిరంలో మిమిక్రీ శ్రీనివాస్ పర్యవేక్షణలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు జరిగాయి.

## వాకర్స్ క్లబ్ కార్యవర్గం ఎన్నిక

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని 80 ఫీట్ రోడ్‌లో ఆదివారం '80 ఫీట్ వాకర్స్ క్లబ్ 'సర్వసభ్య సమావేశం అధ్యక్షులు వడ్డి మన్మధరావు ఆధ్వర్యంలో జరిగింది. అనంతరం జరిగిన కార్యవర్గ ఎన్నికలో అధ్యక్షుడిగా కె.వి.రమణ, కార్యదర్శిగా కోరాడ భుజంగరావు, కోశాధికారిగా పి.గోవిందరావు, వైస్ ప్రెసిడెంట్‌గా దేవరకొండ శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శిగా డి.గిరిబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లాకేంద్రంలోని రెండోపట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లకు సీఐ ఈశ్వరరావు ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొనరాదని, రాజకీయ నాయకుల అండతో భూకబ్జాలు, సెటిల్మెంట్‌లకు పాల్పడరాదని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తే నగర బహిష్కరణ తప్పదని సీఐ హెచ్చరించారు.

## నలుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లాకేంద్రంలోని ఎల్‌బీఎస్‌నగర్‌లో నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతూ పట్టుబడినట్లు ఒకటో పట్టణ పోలీసులు తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.15 వేలు నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

## మహిళల భద్రతపై అవగాహన


ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్: మహిళల భద్రతపై సంకల్పం కార్యక్రమంలో భాగంగా రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్సులో ప్రయాణికులకు అవగాహన కల్పించారు. మహిళలు, యువతులు, బాలికల రక్షణకు పొందుపరిచే చట్టాలు, సోషల్‌మీడియాలో అసభ్యకర పోస్టులు, డిజిటల్ అరెస్టు, ఫొటో మార్ఫింగ్ తదితర కేసుల్లో శిక్షలను వివరించారు.

## సాహితీవేత్తలకు సత్కారం


కవులు, రచయితలను సత్కరిస్తున్న నిర్వాహకులు

శ్రీకాకుళం కల్చరల్: విభిన్నరీతిలో సాహితీ కార్యక్రమాలు నిర్వహిస్తున్న తెలుగు రచయితల వేదిక(తెరవే) సేవలు అభినందనీయమని విశ్రాంత డీఈవో బలివాడ మల్లేశ్వరరావు అన్నారు. తెరవే ఆధ్వర్యంలో 105వ నెల సాహితీ సమ్మేళనం నగరంలోని శాంతినికేతన్ కళాశాలలో ఆదివారం జరిగింది. సంస్థ కార్యదర్శి ఆర్.వి.రమణమూర్తి నిర్వహణలో 'ఫిరదౌసి' కావ్యంపై డాక్టర్ బారువ కోమలరావు సాహితీ ప్రసంగం చేశారు. అనంతరం కోమలరావును సత్కరించారు. ఇటీవల పదవీ విరమణ చేసిన, రాష్ట్ర స్థాయి పురస్కారాలు అందుకున్న భోగిల ఉమామహేశ్వరరావు, కుప్పిలి త్రినాథరావు, పి.తిరుపతిరావు, వావిలపల్లి రాజారావు, కిల్లాన శ్రీనివాస్, తెప్పల కృష్ణమూర్తిలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చాడ శ్రీనివాసరావు, ఐఎన్‌డీ ప్రసాద్, వాడాడ శ్రీనివాస్, టి.లింగరాజు, నిక్కు అప్పన్న, ఇద్ది పాపయ్య, ఎం.ఉపేంద్రశర్మ, తోట గోపాలరావు, తంగి ఎర్రమ్మ, ఈశ్వరరావు పాల్గొన్నారు.

# శేషపాన్పుపై జగన్నాథుడు


గుజరాతిపేటలో శేషపాన్పుపై జగన్నాథుడు


పాండ్రంగి వీధిలో శేషపాన్పుపై జగన్నాథుడు

శ్రీకాకుళం కల్చరల్/ఎచ్చెర్ల: రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా గుజరాతిపేటలో జగన్నాథ స్వామిని శేష పాన్పు అవతారంలో ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం మారు రథాయాత్ర సందర్భంగా స్వామివారిని గుశనగుళ్ల నుంచి తిరిగి ఆలయానికి చేర్చే కార్యక్రమం జరుగుతుందని అర్చకులు తెలిపారు. పాండ్రంగి వీధిలో జగన్నాథ స్వామిని శేషపాన్పు అవతారంలో అలంకరించారు. లావేరు మండలం కేశవరాయునిపాలెం జగన్నాథ రథ యాత్ర ఘనంగా నిర్వహించారు.

# శ్యాంప్రసాద్ ముఖర్జీ సేవలు చిరస్మరణీయం


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కె.శ్రీరాములు

శ్రీకాకుళం కల్చరల్: భారతీయ విద్యావేత్త, అతిచిన్నవసులోనే కలకత్తా విశ్వవిద్యాలయం ఉపకులపతిగా నియమితులైన శ్యాంప్రసాద్ ముఖర్జీ సేవలు చిరస్మరణీయమని శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీరాములు అన్నారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాల, క్రీడలమంత్రిత్వశాఖ, మేరా యువ భారత్, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్, ప్రభుత్వ డిగ్రీ పురుషుల కళాశాల సంయుక్త నిర్వహణలో ముఖర్జీ జయంతి ఆదివారం నిర్వహించారు. మేరాభారత్ డిప్యూటీ డైరెక్టర్ కె.వెంకట్‌ఉజ్వల్, కళాశాల అధ్యాపకులు బి.వరలక్ష్మి ప్రసంగించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆర్.శ్రీనివాస్‌పాత్రో, వైస్ ప్రిన్సిపాల్ వై.పోలినాయుడు, లెక్చరెర్లు ఆర్.హరిత, ఆదినారాయణ, రవిబాబు, ఎస్.అరుణకుమారి, పి.ఎన్.చలమయ్య, వలంటీర్లు దిలీప్‌కుమార్, మట్ట ప్రియాంక, గార మౌనిక పాల్గొన్నారు.

# సంఘటితంగా పోరాడాలి


సమావేశంలో పాల్గొన్న దళిత మహాసభ నాయకులు

రణస్థలం: దళితులంతా సంఘటితంగా ఉంటేనే సమస్యలు పరిష్కరించుకోగలమని ఏపీ దళిత మహాసభ మండల అధ్యక్షుడు బొంపల సూరప్పడు అన్నారు. జె.ఆర్.పురం హైస్కూల్ ఆవరణలో ఆదివారం దళిత మహాసభ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుల సమస్యలు, భూ సమస్యలు, సంఘం భవిష్యత్ కార్యక్రమాలపై చర్చించారు. సమావేశంలో గౌరవాధ్యక్షుడు సాకేటి పోతయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు దత్తి గోవింద, నాయకులు పల్ల సీలయ్య, దుక్క ఆదినారాయణ, మండల కోశాధికారి, నేతల పెంటయ్య, మండల కార్యదర్శి సోమాధుల రమణ, సభ్యులు లండ చినబాబు, ముక్కు రాము, కొంద్రు రాంబాబు, గంట్లాన మారేష్ తదితరులు పాల్గొన్నారు.

# పెంపుడు జంతువులకు టీకాలు తప్పనిసరి


రణస్థలం: కుక్కలకు వ్యాక్సిన్ వేస్తున్న పశు వైద్యాధికారులు

రణస్థలం: పెంపుడు కుక్కలు, జంతువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని రణస్థలం పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.దుర్గారావు అన్నారు. రణస్థలం పశువుల ఆస్పత్రి వద్ద ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా పెంపుడు కుక్కలకు రాబిస్ రాకుండా టీకాలు వేశారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారులు బి.చంద్రశేఖర్, లావణ్య, వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

జి.సిగడాం: జూనోసిస్ డే సందర్భంగా జి.సిగడాం పశువైద్య కేంద్రంలో పశువైద్యాధికారి ఉప్పాడ సుమన్ కుక్కలకు వ్యాక్సిన్లు వేశారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


జి.సిగడాం: కుక్కకు వ్యాక్సిన్ వేస్తున్న డాక్టర్ సుమన్